క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు గాను గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంపీ.పట్వర్ధన్ తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులుండాలని తెలిపారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం చివరి తేదీ అని, సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. గురువారం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 79898 90221, 79970 55562 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగాలి'

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని ప్రజలు ప్రతిరోజు తాగునీటిని వేడి చేసి, చల్లార్చి తాగాలని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు గోదావరి నదిలోకి పెద్ద ఎత్తున వచ్చి చేరిందని, వర్షాకాలం ముగిసే వరకు తాగునీటిని వేడి చేసి చల్లార్చిన తరువాతనే తాగాలని సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

బెల్లంపల్లిరూరల్(తాండూర్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తాండూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని బాధితుడికి అందజేసిన ఘటన మంగళవారం తాండూర్ మండలంలో చోటు చేసుకుంది. బెల్లంపల్లికి చెందిన ఢీకొండ తిరుపతి అనే వ్యక్తి తాండూర్ మండలంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు తిరుపతి తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కిరణ్ కుమార్ అధునాతన సాంకేతికత సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించి సెల్‌ఫోన్‌ను పట్టుకుని బాధితుడికి అప్పగించారు. పోయిన సెల్‌ఫోన్ పట్టుకొని బాధితుడికి అప్పగించడంతో పలువురు పోలీసుల పనితీరుని అభినందించారు.

ఇరిగేషన్ సీఈకి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాకు కొత్తగా బదిలీపై వచ్చిన ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌ను టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. టీఎన్జీవో స్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు శివప్రసాద్, ఈఈ విష్ణు, రోశయ్య, ముత్తయ్య, సంపత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సరోజ

లక్సెట్టిపేట: ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో సరోజ అన్నారు. మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. వెనుకబడిన గిరిజనులు, పేద ప్రజలు ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. అనంతరం పలువురికి జీరో బ్యాంక్ అకౌంట్‌లు, ఆధార్ కార్డులను అందించారు. అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పురుషోత్తం, రిసోర్స్ పర్సన్ రఘునాథం, ఎపీవో వెంకటరమణ, కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

లోతట్టు గ్రామాల సందర్శన



నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న గణపతి

జైపూర్: మండలంలోని లోతట్టు గ్రామాలైన కిష్టాపూర్, వేలాల, పొనూర్ గ్రామాలను మంగళవారం జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి గణపతి, ఎంపీడీవో సత్యనారాయణ సందర్శించారు. గోదావరి తీర ప్రాంతాల్లో భారీ వరద నీరు వచ్చిచేరిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గోదావరి తీరం వైపునకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకూడదని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీవో శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ విద్యాసాగర్‌రావు, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా బడుగ వేడుకలు

- పల్లెల్లో సందడి వాతావరణం
- ఎడ్లను అలంకరించి పూజలు



వేమనపల్లిలో ఎద్దును అందంగా ముస్తాబు చేసి నైవేద్యం పెడుతున్న రైతు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): పొలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని బడుగ వేడుకలను నేతకాని కులస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య రోజున మట్టితో తయారు చేసిన ఎడ్ల ప్రతిమలను దేవుళ్ల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. బడుగ రోజున నేతకాని కులస్తులు నూతన దుస్తులు ధరించి డప్పు సప్పుళ్లతో ఎడ్ల ప్రతిమలను గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారుల్లోని చెరువుల వద్దకు వెళ్లి పూజా కార్యక్రమాలు చేపట్టి, ఎడ్ల ప్రతిమలను చెరువులో నిమజ్జనం చేసి పిండి వంటలు, నైవేద్యాలు సమర్పించి పంటలు బాగా పండి ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సంప్రదాయ నృత్యాలు చేసి వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో మంగళవారం బడుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా నేతకాని కులస్తులు సమీప వాగుల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య రోజు నవధాన్యాలతో తయారు చేసిన గౌరమ్మలను వాగుల్లో నిమజ్జనం చేశారు.

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో బడుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు సాగే ఈ పండుగతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. రైతులు ఎడ్ల కొమ్ములకు నెమలి పింఛాలు కట్టి, ఆలయాల్లో ప్రదక్షిణలు చేశారు. ఎడ్లతో ఇంటింటికీ వెళ్లి పండుగ సందర్భంగా భోజర కట్నం అడిగారు. పిండివంటలు ఎడ్లకు నైవేద్యంగా పెట్టి మొక్కులు అర్పించారు.

నెన్నెల: మండలంలో బడగను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మేకలు, కోళ్లను కోసి విందులు జరుపుకున్నారు. ఎడ్ల ప్రతిమలకు హారతి ఇచ్చి బసవన్నలకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చనిపోయిన పెద్దల సమాధుల వద్దకు వెళ్లి కొబ్బరికాయలు కొట్టి పండ్లు, పలహారాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పిండి వంటలను నైవేద్యంగా చేసి మోదుగు ఆకులలో వడ్డించి దేవుళ్లకు హారతి ఇచ్చారు. జోడెడ్లను మట్టితో చేసి పూజ గదిలో పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టితో చేసిన జోడెడ్లను చెరువులో నిమజ్జనం చేసి గుడికి వెళ్లారు. ఆడపడుచులు మట్టితో గురుగులను చేసుకొని వాటిని గురువారం రోజున చెరువులో నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్‌లు మల్లేష్, శివప్రసాద్, గుండ్లసోమారం ఎంపీటీసీ దాగం రమేష్, నేతకాని కులస్తులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని ఆదివాసీ గ్రామాలైన రేగులగూడ, తాటిగూడ, సోనాపూర్ గ్రామాల్లో ఆదివాసీలు, కాసిపేట మండల కేంద్రంలో నేతకానీలు మంగళవారం పొలాల అమావాస్య, బడుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ఎద్దులకు పూజలు చేసి అటవీ ప్రాంతాల్లోని దేవతలకు నైవేద్యం సమర్పించి సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోనేరావు, కాంతారావు, వసంతరావు, శేఖర్, వెంకటేష్, అర్జు, గోపాల్ పాల్గొన్నారు.



భీమిని మండలం జన్కాపూర్‌లో...



కొమ్ముగూడెంలో ఎడ్ల ప్రతిమలను ఊరేగిస్తూ...



నెన్నెల: ఎడ్లప్రతిమలను నిమజ్జనానికి తీసుకెళ్తూ...

పల్లెల్లో వైద్య శిబిరాలు

- ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ
- సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు వివరించిన వైద్యులు



కొత్తపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కోటపల్లి/భీమారం/లక్సెట్టిపేట: భీమారం మండలంలోని కొత్తపల్లి, లాల్‌బహదూర్‌పేట గ్రామాల్లో మంగళవారం చెన్నూర్ ఎమ్మెల్యే జి. వివేక్‌వెంకటస్వామి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించి విషజ్వరాలు సోకిన వారికి చికిత్స అందించారు. కొద్ది కాలంగా రెండు గ్రామాల్లో జ్వరాల బారిన పడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ మేరకు శిబిరంలో దాదాపు 150మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి నాయకులు అన్నమొల అశోక్, బోయిని లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కోటపల్లి మండలంలోని శెట్‌పల్లిలో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి రక్తనమునాలు సేకరించి, మందులు పంపిణీ చేశారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ లాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా సీహెచ్‌వో సంగయ్య గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వెంకట్రావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో దోమల మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సతీష్, వార్డెన్ మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సిబ్బంది గఫూర్, ఇసాక్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండండి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి

వేమనపల్లి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య, గ్రామపంచాయతీ సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ, వైద్య సిబ్బంది సమన్వయంగా పనిచేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం నీల్వాయి జెడ్పీఎస్‌ఎస్, కళ్లంపల్లి గ్రామంలోని ప్రైమరీ పాఠశాలను సందర్శించి 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా ఆగిపోయిన పనుల వివరాల గురించి ఆరా తీశారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నీల్వాయి కేజీబీవీ పాఠశాలకు వెళ్లి వంట తీరును పరిశీలించారు. వర్షాలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న మామడ ఒర్రెను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు అశోక్, సుదర్శన్, ఎస్‌వో మయూరి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి బీసీ సంఘాల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్రంలో బీసీ కులగణన పూర్తి చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచి ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హాజీపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. బీసీలను మభ్యపెట్టకుండా కులగణన పూర్తి చేసి, బీసీలకు రావాల్సిన ప్రజాస్వామ్య వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, అక్కల రమేశ్, శాఖపూరి భీంసేన్, అంకం సతీశ్, బూరె మల్లేశ్, రాజు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిండుకుండలా 'గోదావరి'

కోటపల్లి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు, కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయడంతో గోదావరి, ప్రాణహిత నదులు నిండుకుండలా మారాయి. పార్‌పల్లి, ఎర్రాయిపేట, బోరంపల్లి, కొల్లూర్, రాంపూర్, దేవులవాడ గ్రామాల్లో గోదావరి ఉధృత్తంగా ఉండగా అర్జునగుట్ట, రాపన్‌పల్లి వద్ద ప్రాణహిత నదులు ఉగ్రరూపం దాల్చాయి. ఎర్రాయిపేట గ్రామం మహేశ్‌కు చెందిన నాటుపడవ, చేపల వల గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయినట్లు నాటుపడవ యజమాని మహేశ్ తెలిపారు. రాంపూర్, దేవులవాడ గ్రామాల్లో కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో కొంతమేర పత్తి చేన్ల వరకు నీరు చేరుకుంది. వరద ఉధృతి అలాగే ఉంటే మళ్లీ పంటలు నీటమునుగుతాయని తీరప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాసిపేట: మండలంలోని సాలేగూడ, గొండుగూడ, గట్రావ్‌పల్లి, రేగులగూడ, ఇప్పలగూడ, తుడుంగూడ గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సాలేగూడ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, వెంటనే నూతన భవనం నిర్మించాలని గట్రావ్‌పల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, కార్యదర్శికి ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ యూత్ అధ్యక్షుడు సిడాం గణపతి, ఉపాధ్యక్షుడు పేంద్రం ప్రభాకర్, కోశాధికారి మోతీరాం, శంకర్, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో అనేక ప్రయోజనాలు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మేథా శక్తి పెరిగి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తాండూర్ మండలం కాసిపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, రూమ్ టూ రీడ్ సభ్యుడు శ్రీనివాస చారి అన్నారు. రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలో రీడింగ్ చాంపెయిన్‌లో భాగంగా రీడ్ ఏ థాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తక పఠనం చేపట్టడం ద్వారా ఆలోచన శక్తి, సృజనాత్మకత పెరుగుతుందని ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేట గ్రామంలో రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో మంగళవారం సంచార గ్రంథాలయాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ బి.రాఘవులు, సీఆర్పీలు రాజ్‌కుమార్, పుప్పాల ప్రవీణ్‌కుమార్, రాజ్‌నారాయణ, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

అన్నదానం

పాతమంచిర్యాల: వర్షాల కారణంగా మాతాశిశు ఆస్పత్రిలోకి గోదావరి వరద నీరు వస్తుందనే ఉద్దేశంతో అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు, పేషెంట్లను సోమవారం అధికారులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న పేషెంట్లు, గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అన్నదానం చేశారు.

బెల్లంపల్లిరూరల్(తాండూర్): తాండూర్ ఐబీ మండల కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కొండు అంజి బాబు నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన కుటుంబసభ్యులు అన్నదానం చేశారు.

బోర్డుపై ఇంకా పాత అధికారుల పేర్లే..!

- ప్రస్తుత అధికారుల పేరు చేర్చని వైనం



కేకే-ఓసీ ఆఫీస్ గోడకు పాత జీఎం మనోహర్ పేరుతో ఉన్న బోర్డు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఇటీవల పలువురు అధికారులు సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ఏరియాలకు బదిలీపై వెళ్లారు. కానీ పలుచోట్ల ఆ అధికారుల వివరాలు, హోదాలు, వారి మొబైల్ నంబర్లు తెలిపే బోర్డులపై మాత్రం మార్చలేదు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి బోర్డులపై ప్రస్తుత అధికారుల పేర్లు రాయిస్తే బాగుంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఏజీఎం రమణకు ఘనంగా వీడ్కోలు



రమణను సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఏజీఎంగా పనిచేసిన రమణ ఇటీవల ఉద్యోగ విరమణ పొందగా ఆయనకు మంగళవారం ఎస్టీపీపీ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు అధికారుల బృందం శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం శ్రీనివాసులు, అధికారుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, అధికారులు ప్రసాద్, సుధాకర్, మధన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బొగ్గు ఉత్పత్తిపై సమీక్ష

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తిపై ఇన్‌చార్జి జీఎం టీ. శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్లో మంగళవారం ఈ సమీక్ష జరిగింది. గ్రూప్ ఏజెంట్లు, గనుల మేనేజర్లు ఇందులో పాల్గొన్నారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఇప్పటివరకు ఉన్న లోటును భర్తీ చేసి ముందు ఉన్న ఉత్పత్తి లక్ష్యాలను నూరు శాతం సాధించాలని జీఎం వారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, ఏజెంట్లు రాముడు, శ్రీధర్, ఏవీ రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, అరవిందరావు, ఆనంద్‌కుమార్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర నాయకుడికి పితృ వియోగం

శ్రీరాంపూర్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాంలు పితృ వియోగం పొందారు. వారి తండ్రి కలవేన సమ్మయ్య(82) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమ్మయ్య సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సమ్మయ్య, ఉదయం పెద్ద కొడుకు శంకర్ ఇంట్లోనే మృతిచెందాడు. మృతదేహాన్ని వారి స్వస్థలం పెద్దపల్లి సమీపంలోని పెద్ద బొంకూర్‌కు తీసుకెళ్లి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, యూనియన్ నేతలు సమ్మయ్య మృతికి సంతాపం తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు

జన్నారం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన కల్లెడ భీమయ్యకు చెందిన పెంకుటిల్లు కూలిపోగా, వారిని కార్యదర్శి వినోద్ వేరే చోటికి తరలించారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి మంగళవారం కూలిన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని భీమయ్య కోరారు.

పంచాయతీకే పరిమితం..!

- రెండు నెలలుగా మరమ్మతులకు నోచుకోని జీపీ ట్రాక్టర్
- ఎక్కడికక్కడే పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు
- వ్యాధులు వ్యాపిస్తే, బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్న జనం



మూలకు చేరిన గ్రామపంచాయతీ ట్రాక్టర్

కోటపల్లి: కోటపల్లి మండలకేంద్రంలోని గ్రామ పంచాయితీ ట్రాక్టర్ గడిచిన రెండు నెలలుగా గ్రామపంచాయితీకే పరిమితం అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. విషజ్వరాలు విజృంభిస్తున్నా, అధికారుల్లో చలనం కలగడంలేదు. పారిశుధ్య లోపం వల్ల వ్యాధులు వ్యాపిస్తున్నా, అధికారుల్లో మార్పు రావడంలేదు. సాక్ష్యాత్తు కోటపల్లి మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ ట్రాక్టర్ రెండునెలలుగా గ్రామపంచాయతీకే పరిమితం అయి చెత్త సేకరణ ఎక్కడిక్కడే నిలిచిపోయినా, సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కోటపల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ రెండునెలల క్రితం రిపేర్‌కు రావడంతో పక్కన పెట్టారు. ప్రస్తుతం ఎంపీవోనే ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఉండటంతో పాటు కోటపల్లి తహసీల్దార్ కోటపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్. వీరిద్దరూ కోటపల్లిలోనే ఉంటుండగా ఈ ట్రాక్టర్ రెండు నెలలుగా కార్యాలయం ముందే ఉత్సవ విగ్రహం దర్శనం ఇస్తోంది. పంచాయతీలో పేరుకుపోయిన చెత్తను తీసుకెళ్లేవారు లేకపోవడంతో ప్రధాన రోడ్డుతో పాటు కాలనీల్లో చెత్తకుప్పలకు నిలయంగా మారాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ట్రాక్టర్ మరమ్మత్తుల వైపు దృష్టి పెట్టడంలేదు. వైన్‌షాప్ వద్ద చెత్త ఉందని జరిమానా విధించి చేతులు దులుపేసుకున్న డీపీవో వారి పంచాయతీ ట్రాక్టర్ పనిచేయక నెలలు గడుస్తున్నా, అటువైపు చూడకపోవడం ఏంటని, పేరుకుపోయిన చెత్తతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు వ్యాపిస్తే బాధ్యులు ఎవరని కోటపల్లి వాసులు ప్రశ్నిస్తున్నారు.

పోషణ మాసోత్సవం ప్రారంభం



ప్రారంభిస్తున్న వార్డు కౌన్సిలర్ ప్రకాశ్ నాయక్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్ అంగన్‌వాడీ 1 కేంద్రంలో మంగళవారం పోషణమాసం కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ బదావత్ ప్రకాశ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్నారు. ప్రభుత్వం తరుపున పౌష్టికాహారం పంపిణీ ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేణుకాదేవి, ఆర్పీ శారద, ఆయా సాలమ్మ, తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం పోషన్ మహా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, హెచ్ఎం రవికాంత్, కార్యదర్శి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నూర్: పట్టణానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్ తల్లి ఇటీవల మృతి చెందింది. కాగా మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పట్టి వెంకటకృష్ణ, అందుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.